# త్యాగమూర్తి

శ్రీమతి ఆర్. యస్. అన్నపూర్ణాదేవిగారు

‘విభు’కు అంతిమ గడియలు సమీపించినవి. అతనికి తన నూకలీ ప్రపంచమున తీరినవని స్పష్టముగా తెలిసినది. తన జీవితములో కొరతలు లేవనియే భావించెను; కాని ‘శశిని’ తలంచుకొన్నప్పుడతని హృదయము, ఆ వేదన భారముతో కృంగిపోయింది. శశి తన ముద్దులకొడుకు. తల్లి, పసికందుగా నున్నప్పుడే గతించినది. అప్పటిలో తనకు రఘు, శశి ఇరువురే సంతానము. రఘు పెద్దకుమారుడు. చక్కని నడత కాతని జీవితమే తార్కాణము. తండ్రి కత్యంత విశ్వాస యుక్త ప్రాయుడు. అతని జీవితమున, లోటుకన్పించదనియే చెప్పవచ్చును. తండ్రి ప్రేమను చూరగొన్న వ్యక్తి. అతని కొరకా తండ్రి హృదయము చింతిల్లలేదు. అతనిదుఃఖమునకు కారణ మాతని చిన్నిశశియే. శశికి అప్పుడు పన్నెండవ సంవత్సరము. వర్తనలో, నడతలో అన్నకు వ్యతిరేకి. అల్లరమూకకు శశితక్క అన్యనాయకుడేడి? ఎచ్చటా అల్లరికి మూలకారణము శశియే! చిన్నతనమే అందుకు కారణము కావచ్చును. అట్టి బాలుని సక్రమ ప్రథమున ప్రవేశపెట్టువారేరి; తనుతక్క! కానీ, తనగడువు తీరినది. శశికింక, రఘుతక్క అన్యలాదరణ పాత్రులేరి? రఘు, సంపూర్ణ హృదయము, అతని మంచితనము తనకు తెలిసినదే! అట్టి సహృదయుని యండనతన శశికి లోటు కల్గదు. కానీ, అట్టిసాధు వర్తనునకీ శశి కొఱకరాని కొయ్యయగునేమో! రఘుకు, శశి బాధ్యత తప్పనిదే. ఆలోచనా పరంపరలు, రఘుపై భారము వేయవలసి వచ్చినదే యన్న తలపులు, అతని కంట నీరొలికించినవి.

కంటికి కునుకులేక, తండ్రికి నిరంతరము సేవచేయు రఘుకి, యశ్రువులు, ఖేదనకల్గించినవి. తన తండ్రి కెందుకో యింత యీ వేదన? అతని బాధకు కారణ మెరుగుట తనవిధి. కంటినీరు తుడిచి, మెల్లగా.

"నాన్నా! ఎందుకా యీ వేదన. చాలా బాధగా నున్నదా" యన్నాడు. విభు కాతని సేవచే మనమున కొంతయో యుపశమనము కలిగెడిది. తనయీ వేదన కారణము, రఘు, శశిని ప్రాణముకంటే ఘనముగ చూడగలడని ధైర్యమున్నది; కానీ, అది భారమేకదా! సన్నని కంఠంతో, రఘును పిలచి.

‘రఘు! నా కంతిమగడియలు సమీపించినవి నాయనా’ అన్నాడు. రఘుహృదయము బరువెక్కినది.

‘నాన్నా బాధగా యున్నదా’ యని యుపశమన పూర్వకముగా మాటాడినాడు.

‘రఘు - యిక - యీ ప్రపంచములో నాగడువు తీరినది. నాకోర్క యొకటి’; అనునంతలో.

‘నాన్నా! ఏమిటాకోర్కె?’ యని ఆత్రుతతో ప్రశ్నించినాడు రఘు.

‘రఘూ! నీవర్తన హృదయము తెలియుని వాడననుకొనకుము. నా కాలము తీరినది. శశి అల్లరిబిడ్డడు; ఆభారము, నీపై వదలక తప్పదు. శశికి యికమీద నీవే తల్లి! తండ్రి! ! సర్వము నీవే! సుగుణరాసికి నీకీ భారము వదలవలసి వచ్చినదనియే నా చింత.’ ...

‘నాన్నా, శశి విషయపు చింత వదలుము. నాకు, తమ్ముడైనను, కుమారుడైనను శశియే. నా ప్రాణము తోడిదియైన శశిని మంచివానిగా విద్యావంతునిగా చేయుదు’నని, పాదములంటి ప్రమాణము చేసినాడు. ఆవృద్ధుని హృదయములోని భారము తగ్గిపోయినది. తనకున్న చింత మాయమైనది. రఘు తన హృదయ శల్యమును మాన్ప బాసచేసినాడు. తనకిక చింత ఏది? అతని ప్రాణములే అనంత వాయువులో నిశ్చలముగా, లీనమయి పోయినవి. రఘు వేదనకంతమే లేదు. కన్నతండ్రి చల్లని ప్రాపు కూడ నేడు మరుగైనది. శశి పిల్లవాడు; అఘోర సంకట మాతని కంతగా గోచరింపలేదు. రఘు హృదయము శోకసాగరమున కాలవాలమైనది.

రఘు, కళాశాలలో అధ్యాపకుడుగా నున్నాడు. అతనికి, భార్య, యిరువురు కుమార్లు, కొమార్తె యొక్కతె కలదు. కొంత భూస్థితి కలదు. పరిస్థితుల ననుసరించి సాధారణ కుటుంబమనియే చెప్పతగును. శశికిప్పుడు పదహారు సంవత్సరములు. నిశితమైన ప్రజ్ఞకలవాడే కాని, అల్లరి సావాసము. చదువుకొనుట కాతనికి తీరిక యున్నకదా! అన్న సాధువు. తండ్రి కూడ లేని యాతనిని కఠినముగ మందలించుట రఘుకు సాధ్యముకానిపని. శశి మెట్రిక్యులేషన్ తరగతికి ఎట్లో వచ్చినాడు. అట్టిచో, కష్టపడి చదువకున్న కృతార్థుడేలా కాగలడు? లలితకు, తనమఱది చర్యలు చూచి భయము కల్గినది. భర్త అభిమాన దోషమున మందలింపనిచో, శశిభావిగతి ఏమి? తనమామగారి అంతిమాశయము నెరవేరడమెలా? భర్తకీవిషయము తెల్పి, శశిని మందలించకున్న, ప్రమాదమన్నది. రఘుకు, శశియన్న ప్రాణము. కాఠిన్యము తెలియదే! అలా యూరకున్న? తన తండ్రి మూర్తి కన్నులకు కట్టినది. ఆతని యాదేశానుసారము తనవిధి నెరవేర్చవలసినదే. ఆయాశయ సిద్ధికి - తన ప్రేమ భంగికారి. పసితనము; తెలిసికొన గలడని యూరుకున్న వెనుక చింతించుట వెఱ్ఱితనమగునేమో!

మనమున దృఢ నిశ్చయము కల్గినది. ఇక తన వర్తన కొంతమారవలె. శశి రాత్రి తన మామూలు మేళము, నిదానముగా వచ్చి, వదినకడ కూర్చుండినాడు. అన్నమునకు రావలెకదా! సమయమునకు రఘు వచ్చినాడు. అన్నతో శశి పంక్తిని కూర్చున్న దినమేది? మౌనముగ కూర్చొన్నాడు శశి. రఘు, 'శశీ నీవర్తన ఏమీ బాగాలేదుసుమా! సక్రమముగ చదువుకొనకున్న ఎలా? నీపైనే ఎన్నియో యాశలున్న మాకోరికలు కోరికలే యగునేమో! బాధ్యత తెలియక చరించిన భావికాలము భారముకాగలదుసుమా' అన్నాడు. శశి కెన్నడిట్టి సంఘటన సమకూరియుండలేదు. ఎన్నడు పల్కని, యన్న, నేడిట్లుపల్కినచో, అతనెంతగా చింతించియుండునోకదా! అవును తను చదువుకొనకున్న ఎలా? తనదితప్పే! భావసమరము చెలరేగినది. మెల్లగా. 'అన్నా, యికపై శ్రద్ధగా చదువుకొంటానని' పల్కినాడు.

'నా ఆశయము, ఆశలు, అంతియే శశీ' యని యూరకొన్నాడు రఘు. నాడుగడచినది. శశి విశ్వప్రయత్న మొనరించినాడు. చదువుపై మనసు నిలిచినకదా! కానీ తన యాటలుసాగలేదు. రఘులో విచిత్రమగు మార్పు కన్పించినది.

తను సకాలమునకు రానందున, ఒక్కనాడు చెంపపెట్టు తగిలింది. రఘు యింతకఠినుడని తను తలచలేదు. విధిగా తాను యింటనుండ వలసి వచ్చెడిది. తన మనమెంతయో బాధనందినది. కాని పసితనములో ఆ యన్న మహోన్నతాశయములు కన్పించలేదు. శశి చుఱుకైనవాడు. ఆతను పట్టుగా కూర్చొన్న, చదువాతనికి కష్టమనిపించెడిదికాదు. నేడువిధి దానిఫలితమో!

నాడు తాను కృతార్థుడైన వార్తవిని యన్న యానందబాష్పముల రాల్చినాడు.

శశి పరీక్షలో యుత్తీర్ణుడై కళాశాలలో చేరినాడు. కొంతబాధ్యతలు తెలియజొచ్చినవి. రఘు శశిని కొట్టినరోజు, పిచ్చివాడు వలె తయారయినాడు. శశిని, తన తమ్ముని కొట్టడమా? అది ప్రేమలేమిచే కాదు. ఆతని భావిభాగ్యోన్నతికై. తన ప్రమాణము! తన్నింతకు తెచ్చినది. నేడు శశి కళాశాల విద్యార్థి; తనకు వచ్చుసంపాదనలో పొదుపుగా కాలక్షేపము చేయవలసి వచ్చినది. సంసారము, శశి చదువు. గొప్ప స్థితియున్న కొదువలేదు. తన సౌఖ్యములను తగ్గించి, శశికేలాంటి కొదువలు కల్గించలేదు. రఘువంటి సోదరునిగన్న, శశివంటివారెందరు? కేవలము తనసుఖమును గూడ తమ్ముని సుఖమునకు ధారవోయు యుదారులెందరు కలరు? అట్టిదా సోదరప్రేమ !!!



(సశేషము)

# త్యాగమూర్తి

శ్రీమతి ఆర్. యస్. అన్నపూర్ణాదేవిగారు

(1951 ఫిబ్రవరి సంచిక తరువాయి)

'గీత' రఘు యింటికెదురుగానున్న, శ్రీమంతుడు 'మూర్తి' ఏకైకపుత్రి. సౌందర్యరాసియని చెప్పుటనవసరము. చిన్నతనమునుండి, తనకామె పరిచయమే. రఘుకు, పసికందు 'గీత' యన్న అమితప్రేమ. తన పిల్లలతో ఆటలాడ వచ్చెడిది. అట్టిచో శశి గీతలు కలసి మెలసి ఆడుకొనువారు. శశికి, గీత బాల్య స్నేహితురాలు. ఆట పాటలతో అరంభమైనది వారిసెయ్యము. నేడు శశి యువకదశనున్నచో, గీత, నవయౌవనయైనది. శశికి, పదునెనిమిది వత్సరములు. గీతకు పదునైదు వత్సరములు. వారిలో పూర్వ పరిచయము మరుగుకాలేదు. కలయికలు చాల కొద్ది యనవచ్చును. బాల్యస్నేహితులే. నేడు వారి దృక్పథములు, భావనలు వేరు. చిన్నతనపు చెలిమి కాల బలిమిని ప్రేమగా మారినది. వారి యనురాగమున, మూర్తిహృదయమున - వారు దంపతులేల కాగూడదనిపించినది. గీతకు శశి తగినవాడే. స్థితిలో తాను శ్రీమంతుడైననేమి? శశి తనకు అల్లుడగుట సమ్మతమే. కాన గీత శశితో సంచరించుట కాతని అసమ్మతి లేదు. కాలక్రమమున వారి ప్రేమకు ఫలితము - వారు - అనురాగదంపతులగుటయే. రఘుకు గీతయన్న ఎంతయో ప్రీతి. వారి యనురాగమునంతగా నాతడు గమనింపలేదు. అతని లక్ష్యము శశి గొప్పచదువు చదివి - ఘనుడనిపించుకొనుటయే! ఆ లక్ష్యమునకు తన ప్రాణమైన బలినీయుగలడు! శశి చదువు కొంత మందగించినది. అతనిపోకడ వర్తన చూచాయగా గ్రహించినాడు రఘు. గీతపైగల ప్రేమ తెలిసినది. గీత, తన మఱదలగుట తన కంగీకారమే; కానీ, యిప్పటిలో అది పొసగనిదే - కారణము; శశి చదువున కంత రాయముకదా? గీత, శశి ప్రణయము చాలదూరముపోయినది. ఇక వారిని విడదీయటము కష్టమే; కాని - పై చదువునకు, శశిని కలకత్తా పంపతలచినాడు. అది చాలశ్రమయుతమే. పట్టణవాసము - కళాశాలలో పై చదువు. అంతధనము తనెలా తేగలడు? ఏమైననుసరే, శశి, కలకత్తా వెళ్లవలసినదే! తను సంపాదనకు తోడు - మరికొంత శ్రమపడిన - తీరునుకదా? శశి, ఇంటరు పరీక్షయందు దారితేరినాడు. గీత, యానందమునకు మేరలేదు. రఘు-, 'శశి'ని, డాక్టరు పరీక్షకు పంపతలచినానని - కలకత్తా వెళ్లవలయునని తెల్పినాడు. ఇది విషమసమస్యగా పరిణమించినది. గీతనువిడచి, తనెలా బ్రతకగలడు? గొప్పచదువు - పట్టణవాసము - చాల కోరతగినవే! ఏమిటో, సంతోషము సగముబలమనిపించినది - తన ప్రయాణము తప్పనిదే - గీతయశ్రువులు చూడలేకపోయినాడు. తన్నుతక్క- అన్యుల పరిణయమాడనని యామెకు బాసచేసినాడు. తను లేఖలతో నిరంతరము క్షేమసమాచారముల తెల్పుచుననినాడు. విడలేక విడలేక, ఆప్రేయసీ ప్రియులు విడువడినారు. 'కాలగతి మాన్పంగ తరమె ఎవ్వారికైన!'

♦ ♦ ♦

కలకత్తాలో ప్రవేశించిన శశికి క్రొత్తలో చాల కష్టముగనుండినది. పట్టణములోని విద్యార్థుల వేష, భాషలు - వింతగా కన్పట్టినవి. తనయూరికి - యిచ్చటికి - హస్తిమశకాంతరమే! ధనమునకు విలువయున్న కదా! ఎంతైనను చాలడములేదు. తనయన్న కనవసరశ్రమ కల్గించకూడదనుకొన్నను ధనవ్యయము చాల ఎక్కుడుగనున్నది. ఇంత ధనము తనకు సకాలములో రఘు పంపగల్గిన శశికి ఆశ్చర్యమనిపించినది. సెలవులకు యింటికి వచ్చినప్పుడాతనికి, రఘు పైకము పంపువిధము కొంత తెలిసినది. రఘుకు - తనకువచ్చు వేతనము సంసారఖర్చులకే తగును. తనకైయన్న - తన యుద్యోగ నిర్వహణానంతరము - మిల్లు లెక్కలు

సరిచూచి, ప్రయివేటులు చెప్పి, గడించుచున్నాడు. రఘుకు, తీరికసున్న. శశిచదువు, రఘు చెమటకంటె- రక్తముతో- గడచుచున్న దనవచ్చును. కాని రఘు, తన శ్రమను తనకు తెలుపలేదు. పట్టణమున కష్టపడక, తనకు కావలసిన మొత్తము వ్రాసిన పంపగలనన్నాడు. ప్రపంచమున తనకుమాలిన ధర్మ మున్నదా? అట్టిచో ఏమిటి. యీసోదరుని వాత్సల్యము? శశికి, రఘు, సోదరుడనుటకంటే తండ్రియన్న సమంజసమేమో. అట్టి సహోదరుని కల్గిన శశిధన్యుడనుటలో సందేహమా? రఘు తనకై పడుచున్న శ్రమజూచి శశి జాలినందినాడు. ఇంతకష్టమునకు, ప్రతిఫలము? తను, డాక్టరుగా, రాగనే తీర్చగల్గుదునని తలచినాడు. తన అన్నకు తనచర్మముతో చెప్పు కుట్టియిచ్చినను ఋణముతీరదు. తను- శ్రమలకోర్చి అన్నకోర్కె తీర్చుట తనవిధి గీత, తన వియోగబాధతో చాలా కృషించుచున్నది. తనచదువు ముగిసిన అన్నకు విశ్రాంతి, తనప్రణయ రసాధిదేవికి హృదయశాంతి చేకూర్చకలదు. ఆమధుర భావనలే ప్రియుల విడివడి యుండుట కుపకరించినవి. కానిచో- గీత శశినివదలి యుండలేదేమో !

శశి ప్రప్రథమ శ్రేణిలో కృతార్థుడగుచు- నాలుగేండ్లు గడపినాడు. ఇక ఒక్క-వత్సరమే. తన వ్రతముగడచిన, తన యిడుములుగడచినట్లే! రఘుకు దేహారోగ్యము నశించినది. తలకుమించినశ్రమ. కానీ, యిక యొక్క సంవత్సరమేకదా! తర్వాత, తనశశి, తనయాశయ పరిపూర్తిగావింపగలడు. తనశ్రమ సన్నగిల్లకలదు. నాడు పర్వదినము కానీ వింతగా శశి కొద్దిరోజులనుండి ధనము, ఎక్కువగా పంపకోరినాడు. పట్టణమున ఏకష్టములు కల్గునోయని, చేత లేనందున, రఘు- భార్య నగలనమ్మి పంపినాడు. విచిత్రముగా, శశి- మాటి మాటికి డబ్బుపంపమని, వ్రాయసాగినాడు. శశితో ఏమిటీ యీమార్పు! బహుశా కావలయునేమొ? అన్యాయముగా వ్యయమొనరించెడి వాడు కాడే? తనజీవితము నెంతో సక్రమపథమున నడుపుట తనకు తెలిసినదే! కానీ- ఏమిటో కొంత చింతకల్గినది. అనుమాన మినుమడించినది గీత, రాకతో. గీతకు శశికి ప్రణయభావనలున్నవని తనకు తెలిసినవే. కానీ ప్రేమికులేలా బహిరంగముగా తెల్పగలరు. గీత పరిణయమై రఘుతో మూర్తి ప్రస్తావించియుండగా చదువు పూర్తియైనంతటనే. చేయకలవాడనని వాగ్దాన మొసగినాడు. గీత, తనకు, కాబోవు 'బావ' గారితో, అంతగా మాట్లాడుటలేదు. చిన్న తనముప్పుడు రఘు. తన్ను, లాలించినది నిజమే. కానీ నేడు - అతను తనకు కాబోవు భర్తకుఅన్నగారు; కాన కొంతసిగ్గుగా యుండెడిది. చనువుగా ప్రవర్తించుటకు నాడు గీతరాక ఆశ్చర్యము గల్గించినది. రఘు గీతనుచూచి

"గీతా, ఏమిటి సంగతి చాలరోజులకు రాకకదా" యన్నాడు పరామర్శకంగా.

గీతలోని ముఖ కవలికలలో, విషాదచ్ఛాయలు స్పష్టంగా గోచరించినవి. ఎందుకా విచారము? రఘుకు కారణము గోచరింపలేదు. గీతలోని యీమార్పు, తన్ను కలవరపరచినది. అప్రయత్నంగా, గీతకంట నీరొలకడమును గుర్తించి

"గీతా ఏమిటి సంగతి కంట నీరెందుకమ్మా? సంగతి చెప్పవూ? ఎందుకా విచారము" అన్నాడు. అశ్రువులు పొంగి పొరలినవి. మాటలు తడబడినవి గాద్గదికంతో.

తమ్ముడుగారు - జాబులు వ్రాస్తున్నారా? ఆరోగ్యమేకదా? యన్నది. రఘుకు కొంత గీత యవస్థ గోచరించినది. శశినుండి జాబురాలేదని బెంగ ఏమొ? మెల్లిగా,

'ఏం, శశి జాబువ్రాయలేదా? కొంతజాగైనదేమో - వ్రాస్తాడు లేవమ్మా - అంతమాత్రమునకేనా యీచింత' యని సముదాయింప చూచినాడు.

'బావా, కొంతజాగా? రెండునెల్లైనది శశినుండి జాబువచ్చి; ఎన్నిమారులు వ్రాసినా బదులులేదు. ఇక నిలువలేక, క్షేమమరయ వచ్చినా'నన్నది యికమాటలు పెగులలేదు. రఘుకు మతిపోయినట్లైనది.

శశిలో యింతమార్పా? ఎందుకీ విచిత్రవర్తన. కారణమేమో? శశి ఖర్చులు మితిమీరిపోయినవి. చాలా చిత్రమే. గీత, పాపము-దిగులుగొన్నది. ఎందుకో, కాలహరణమైనది. బహుశా తీరికలేదేమో కడపటి వత్సరముకదా? ఇన్నిరోజులలో లేనిచదువా? ఏమిటో వింతభావములు రాసాగినవి. శశి ప్రవర్తనలో లోటులేదు. ఏమి కారణమో? గీత నోదార్చుతూ

"గీతా, బహుశా, చదువుతొందరలో ఏమరినాడేమో? నేను వ్రాసి తెలుసుకొంటానులే. తొందరపడకు, అంతమాత్రమునకు చింత ఎందుకమ్మా' అన్నాడు. గీత, బావగారి వాక్కులతో కొంత యుపశమించినట్లు కన్పించినది. గీత, రఘుదగ్గర శలవు తీసుకొని వెళ్లినది. రఘు ఆలోచనలో పడినాడు. శశి వ్యయములోని మార్పు, ప్రాణప్రదముగా చూచు గీతకే జాబువ్రాయకపోవడము ఏమిటి యీవిచిత్రపు ప్రవర్తన? ఆలోచనల కంతరాయము కల్గినది. తంతి వచ్చినది. 'శశి' నుండి తనకు ఆరువందలు అవుసరముగా పంపవలెనని. కొద్దిరోజులకు మునుపే అప్పుచేసి మూడువందలుపంపినాడు. మరి యిదిఏమి? తన అనుమాన మినుమడించినది. శశిలో మార్పు స్పష్టముగా కన్పించినది. తన కనవసర శ్రమయొసగని శశి! ఏమిటి యీదారుణ పరిస్థితి. అంతధనము తనెలా తేగలడు? తను కలకత్తా వెళ్లి స్వయముగా, శశినిచూచి, ధనము నీయ సంకల్పించినాడు. సాయంత్రము తనపేర లేఖవచ్చినది.

రఘుగారికి, శశిహితుడు, మధు, నమస్కృతులు; తమకు నేను అపరిచితుడనే! శశి నాకత్యంత హితుడు. అతని విచిత్రప్రవర్తనయే నా లేఖకు కారణము. శశిజీవితములో గొప్పతుఫాను ప్రారంభించినది. దుష్టసహవాస మబ్బినది. ఎట్లు కలసినదో, శశికిని, దేవదాసి, శోభకు హితము కలిసినది. ఇక వేశ్యా విహితము, దానిఫలితము చెప్పవలెనా? చదువునకు స్వస్తి. పెడదారి త్రొక్కినందుకు చాల విచారము కల్గినది. హితమూ తనికిప్పుడు రుచించుటములేదు. త్వరలో మీరు రాకున్న శశిగతి ఏమగునో! ఎట్టివాని కెట్టిమార్పు. అగ్నికే చెదలంటినది. ఈ విషయము మిమ్ము యావేదన పెట్టినను, యిప్పటిలో మార్గాంతరము కన్పించలేదు. సమక్షమున సంగతులు తెలియగలవు. ఇప్పటిలో మీరాక యత్యంతావసరము. మీకు మానసికావేదన సమకూర్చినచో మన్నింపవేడుతూ విరమించు,

'మధు'

రఘుకు తలతిరిగి పోయినది. కలలో తలచని సంఘటన శశికి. దేవదాసి పొత్తా? నిజమా? తన శశి! అట్టినైచ్యమునకు పాల్పడునా? ఇది అపవాదనుకొందమన్న ఆ వ్యక్తికి కల్గెడి లాభమేమి? శశీ, ఎట్టిదారుణము! తన యాశలిట్లు పరిణమించినవేమి? వెన్నపడుచో భాండము బ్రద్దలైనదా? విధి! అమృతమయ కళశమున హాలాహలము! కలలోనైన తలవని విపత్తు. చేసెడిదేమి? అందుకేనేమో, తనకావ్యయము. గీత వేదనలోని యర్థమిదే. కాకున్న తనప్రాణప్రదమైన గీతకే జాబువ్రాయక పోవటమూ. ఇంతకూ, తన యాశలు, శ్రమ, ప్రతిన, యుత్సాహము నట్టేట కలసినది. విధి అనుల్లంఘనీయము! చేసెడిదేమి - అనుభవించక. తనకు కలకత్తా ప్రయాణము తప్పని సరియైనది. తన శశికై, తన సర్వసౌఖ్యముల బలినిచ్చినది, శశినొక విలాసిని కామపరితప్త పరిష్వంగమునకు దాసుకొనర్చుటకా? శశి, గీతను పరిణయమాడి సుఖించుట చూడతలచిన తనకు శశి విలాసవతి వయ్యారముల వలలో చూడవలసి వచ్చెనే చేసెడిదేమి? ముండ్లనాటి పండ్లనాసించిన తగునా?

♦ ♦ ♦

అదిశోభగది. అత్యంత మనోహరముగా నలంకరింపబడినది. శోభ నవయౌవ్వని. రూపవయో విలాసముల కునికి దేవదాసి. శశిని చూచిననాటినుండి యాతనిపొందు నభిలషించినది. తనకులవృత్తిలో దిగి రెండు వత్సరములే యైనను, సిరిగల పేరు గనుక, ఎంతో గడించినది. సానిటక్కులకు కొదువలేదు.

విద్యాగంధముకూడ, వయోవిలాసాదులకుతోడు. శశి, తన్నుకన్నెత్తి చూచినదిలేదు. అతను విద్యార్థిలోకమునకు వ్యతిరేకి. ఎందుకో యాతని రూపురేఖలు తన్నాకర్షించినవి. తనవయ్యారములు, కులుకులాపెకు తోడ్పడలేదు. పన్నినదొకమిష. కళాశాలకు వెళ్లునపుడు, పెద్దకేక పెట్టినది. శశి దిగ్భ్రాంతుడై చూచినాడు. నిర్ణయప్రకారమామె సేవకు లీతనికడ పరుగిడి వారి యజమానురాలికి ప్రమాదమని-సహాయమవసరమనిఅన్నారు. పాపము, కష్టమునమున్న ఆడదని పరుగిడినాడు. శోభ అచట పడియుండినది. ఏదో కరచినదట. తనకామె యవస్థ యగోచరమనిపించినది. తనకు తెలిసిన ప్రథమచికిత్సచేసినాడు. గుణ చిహ్నములేవి కన్పించలేదు. ఆమె అలాయగుటకు కారణమేమో! నటన యన్నసంగతి పాప మాఅమాయకునకు గోచరించలేదు. తర్వాత ఆమె తేరుకొన్నది. సేవకులు డాక్టరును తోడ్కొను మిషతో వెళ్లినారు. శోభకది చక్కటి సమయము. మెల్లిగా "క్షమించండి, పాపము. మీకు అనవసరముగ శ్రమ కలుగజేసినందుకు, చాలా చింతగానున్నది." "ఆఁ! శ్రమయేమున్నదిలేండి, కష్టములు మానవులకు గాక మానులకా," యన్నాడు.

'ప్రపంచములో, తమవంటి దయస్వరూపు లేకోటికొక్కరో. ఇంతకూ' యీకష్టమే, తమ పరిచయ భాగ్యము సమకూర్చినది. మీఋణమేలా తీర్చగలనో? ఇంతకూ తమపేరేమిటో తెలుసుకొన వచ్చునా? అన్నది.

'శశి' యన్నాడు మెల్లిగా.

'అపూర్వ కలయికే! శశి యాదరమున్ననేగా శోభ జగతికి' యన్నది, తాను శోభయన్నది తెలియజేసినది. అపూర్వమైన కలయిక. ఇక తన్ను శయనాగారములోనికి తీసికెళ్లమన్నది. శశికి కొంతసిగ్గనిపించినది. వెళ్ళకున్న కఠికనేల యాసుకుమారికి శయ్యయా? శోభకోరిక లీడేరు కాలమాసన్నమగుటచే నాటి రాత్రి శశి హృదయమును, కలచి, వలపించి, వలపు దోబూచులతేలి, ధన్యుగాలి ననిపించుకొన్నది. శోభ వెలయాలు, వెలలేనిది, చెంతచేరునా. శశి దాసుడై, తన కార్యమును మరచి, శోభకు పాదాక్రాంతుడైనాడు. శోభ కనుసన్నలతో కోర్కెలీడేరవలసినదే. శోభనుండి తప్పించుకోలేకపోయినాడు. గీత నుదుటి గీతప్రకారము ఏమగునో - కానీ. తనకామె స్మరణయేలేదు. అన్న, యాతని యావేదన, ఆశయములు తనకు తెలిసినవే. అన్నియు శోభముందు, ఫేలవయు లనిపించినవి! శోభకోరికలు తీరుట కన్నకు లేఖలవర్షము ధనము, ధన మూలం మిదం జగత్ కదూ! శశీ. ఎక్కడి శశి. శోభ కృత్రిమప్రేమ డోలికల, వాస్తవజగత్తాతనికి కన్పించలేదు. అట్టిదా శోభప్రతిభ. అందుకనే "ఆడువారి చూపుటంపర గెలువంగ తరముకాదు." త్రిపురవైరికైన యన్న నీతివాక్య. శశి కాలప్రభావమున కర్తవ్యతా మూఢుడై- శోభవలపు బానిసయై చరించుచున్నాడు.

శశికి హితుల బోధలు తలకెక్కలేదు. సహజమే, రోగికి పథ్యము రుచించునా. శోభ వెలయాలా? అనురాగ రసలహరి. లోకము ప్రేమతెలియక తన శోభను, కులట యంటున్నది. నిజమునకామె సద్గుణఖని తనకు తెలియును; తన శశిని విడిచి క్షణముండలేనిది ప్రత్యక్షముగ తెలిసినదే. లోకము గ్రుడ్డిది. తనకు లోకులతో పనిలేదు. కాని, కాలమొక్క రీతిగా గడవదన్న నిజము, శశికి తెలియు రోజులు వచ్చినవి. శోభవర్తనలో మార్పు కన్పించినది. ప్రవర్తన మారినది. తన్ను అలక్ష్యము చేయు రోజులు వచ్చిన వనిపించినది. శోభయింట నూతన యాగంతుకులు కన్పించ సాగినారు. తన యాజ్ఞలశిరసావహించు శోభ - నేడంత శ్రద్ధ చూపునట్లగుపించలేదు. వెల యాలిగుణము వెలుగునకు వచ్చుచున్నది. కాని శశి భావనలో మార్పులేదు. నేడాతని యాత్మ గౌరవము కూడ మంటగలసినది. శోభ ప్రేమ తనకున్న చాలు - ఆమెవర్తన ఎలాయున్న తనకెందుకు? శోభకు యిక శశినుండి యాశించవలసినదిలేదు. ఇక గెంటడమే తరువాయి. శశిచాల చిక్కిపోయినాడు. కన్నులు గుంటలు పడినవి. శోభకడకు రాగా చాల తిరస్కారముగ పల్కరించినది. శశిని చూచి 'ఏమీ - శశిగారికింకను మోజు తగ్గలేదా? ధనములేని శశి. పల్కుల తీపితో పొట్టగడచునా'? యన్నది ఎత్తిపొడుస్తూ.



(సశేషము)

# త్యాగమూర్తి

శ్రీమతి ఆర్. యస్. అన్నపూర్ణాదేవిగారు

(గత సంచిక తరువాయి)

శోభా - ఎంత దయాశూన్యమో నీ గుండెకదా! నీకై, పలుశ్రమలకోర్చినది తెలియదా? రక్తమోడ్చిన యన్న ధనము నీకొసగలేదా - యింకను, యీసాధనలేనా?

'శశీ! నీవు హృదయశూన్యుడవోయీ - నీకు ప్రేమ తెలియునా? లేకున్న, నిన్నంతగా ప్రేమించిన గీత నధోగతిచేతువా? కన్నతండ్రికి మారుగా చూచుయన్నకు, యిన్ని యిక్కట్లుకల్గింతువా? నీవొక కాముకుడవు - నీకు ప్రేమకూడనా?' శశి గుండెలు జారిపోయినవి. ఎంత లేనిమాటలు, శోభ పల్కుతేనా, శశీ, నిన్నువిడచి మనలేదన్న - నీప్రణయ రసాధిదేవినన్న, శోభయేనా? ఎంతనిర్దయ?

'శోభా - నీవేమన్న సరియే - కానీ - నాకు నీ ప్రేమభిక్షమాత్రము మరవకు, నీ ప్రేమలేకున్న, నాబ్రతుకు గడువదు - నీ పాదములాన' యని - శశి శోభకాళ్లపైవ్రాలినాడు.

'శశీ, ప్రేమవీరుడవోయీ, నీ త్యాగమాచంద్ర తారార్కమై వెలయగలదు!' యన్న పల్కులు వినిపించినవి. శశి, శోభ లదరిపడినారు, శశి - తన కన్నులను నమ్మలేకపోయినాడు. ఆ యాగంతకుడు - తనకై రక్తమును ధారవోయుచున్న, సహోదరుడు రఘు!!! రఘు - ఎలా యిచటికి రాకల్గినాడు, తాను శోభ, శోభపదములనుండి లేచినాడు. రఘు సమీపించి 'శశీ, తండ్రియాశయము లతిచక్కగా నిర్వర్తించినావు నాయనా? ప్రణయరసాధిదేవినుండి ప్రణయభిక్షకోరి ధన్యుడవైనావు. ఇట్టి సన్నివేశము నన్ను చాల యానందమున ముంచినది - ధన్యమైనది - నాజన్మ' యన్నాడు. శశి హృదయములో, అవమానము, చింత, ప్రజ్వలించినవి. శోభ కాళ్లపైతాను - యిట్టిస్థితిలో, శోభ తెలిసికొన్నది - అతనే 'శశి' యన్న యని. యిక పీడతొలగినట్లే!

'శశి యన్నగారు తమరేనా? చాల ఘనుడగు తమ్ముని యన్నగారే' యన్నది.

శశి కిది పిడుగువలె తోచినది. తన్నుకాక - తన యన్ననుకూడ, పరిహసింప బూనుకొన్నదా - క్రోధముతో కన్నులు - ప్రజ్వలించినవి; 'శోభా - ఆగు - యింకొకమాట - నీప్రాణమునకే ముప్పు' యని గర్జించినాడు. శశిలోని యాత్మగౌరవము పొంగినది. శోభ కిది పరిహాస మనిపించినది.

'శశీ, తాటియాకు చప్పుళ్లకు, కుందేళ్లు బెదరవు - పాపము - అన్నపైన - అభిమానమేనా, నీవు - మానవ రూపునున్న రాక్షసుడవు - ఘోరపాతకివి - నీచుడవు - నీవా, నాకు హితము చెప్పునది; యనుచునే 'హా' యని నేలకొరగి - రక్తపుగుంటలో వ్రాలినది. నేలయంతయు రక్తసిక్తమైనది - గుండెలో బాకు గ్రుచ్చుకొనుటచే యామె క్రిందపడి - మరణించినది. నీచురాలి జీవితమునకంత మదియేనేమో!

అతివిచిత్రముగ, తను మునుపే, శోభ తిరస్కరించిన, ఆత్మహత్య చేసికొనతలచి తెచ్చిన బాకు తన చెంతనుండినది. కోపమున కన్నులగుపించలేదు. కులట, తన్ను నాశనమొనరించినదే కాక, తన్ను నిందించినదే కాక, దేవతాస్వరూపుడగు, అన్నను నిందించుట సహింపలేకపోయినాడు. తత్ఫలితము - తనబాకు శోభ కీప్రపంచమునుండి విముక్తి ప్రసాదించినది. రఘు విభ్రాంతుడైనాడు. క్షణములో జరిగిన దీ

సంఘటన - ఘోరము - తన ఎదురుగ, ఘోరహత్య - ఇక తరుణోపాయము. శోభ - అరపుతో సేవకులు వచ్చి - యీ దృశ్యమునుచూచి, రక్షకశాఖకు తెలిపినారు. రఘు, శశి ఇరువురు - నిశ్చేష్టితులై నిలచియుండినారు. రక్షక భటాధికారిరాగనే, రఘు - ముందుకువచ్చి తనే ఆ హత్యచేసినాననని, తనకు దండనవిధించవలయునని, చేతులనందించినాడు. శశికి, కన్నులు తిరిగిపోయినవి. మాట పెగులలేదు. రఘుచేతికి సంకెళ్లు తగిలింపుచుండగా, తానే, దోషినని రఘు నిర్దోషియని అరచినాడు. అతని పల్కుల వినువారేరీ? రఘుకు బేడీలు - చెరసాలప్రాప్తి. శశిమాట విన్నవారేరి?

శశి యీలోకమునకు వచ్చినాడు. ఏమిటిది తను చేసినదేమిటి? తత్ఫలితము - ఆచరణతనది - అనుభవము - అన్నదా? ఇది - జరుగదు. న్యాయస్థానము - తాను - న్యాయముగ తననేరమును చెప్పిన, అన్నకు విముక్తికల్గకలదు! అతనిపేరు - తను - పల్కుటకునకే అనర్హుడు. తంపంటి, నీచుని నరకవలసినది - ఇదేమి? అట్టి యకార్యమును - తానాచరించినా నన్నదెందుకు - న్యాయపరిపాలనలో - శిక్షయైన - ఘోరము - తనవలన పడరాని - యిడుములు; తుదకు ప్రాణముకూడ, బలిదానమా? అట్లెన్నటికి జరుగదు. తను బ్రహ్మచారి - గీత! తన రఘు భార్య - పిల్లలు. వారందరిగతి - ఏమికావలె? ఎంతదారుణ పరిస్థితి - తననేరము - చెప్పవలె - రఘును రక్షించవలె లేకన్న - రఘును తలచిన - తనకు పిచ్చికల్గినది; రఘును చూడటానికి - అనుమతి దొరకినది. వెళ్లి కాళ్లపైబడి భోరునఏడ్చినాడు. రఘు చెప్పినదొకటే 'శశీ, గీతను పరిణయమాడి, వదినెను, పిల్లల కాపాడుదునని వాగ్దానము చేయుమన్నాడు. ఏమిటీ వింతకోరిక! తనకోరిక! తనకోరిక - అంతిమకోరిక తీర్చడం - శశి విధి - శశి ఏమో చెప్పతలచినాడు - కాలవ్యవధి మీరినందున వచ్చివేసినాడు!

గీత, మూర్తి, లలితపిల్లలు - కలకత్తావచ్చినారు. ఈ విషాదసంఘటన వారిని పిచ్చివారిగాచేసినది. న్యాయవిచారణజరిగినది. తీర్మానమే మిగులు. శశికి - గీతను పరిణయమాడు బాధ్యత, పిల్లలు, వదినె పోషణ అట్టి శోకసాగరమున - పరిణయమా?

◆ ◆ ◆ ◆

న్యాయాధీశుని తీర్మానము - రఘు దోషియని - తత్ఫలితము - ఉరిశిక్ష. శశి, కుటుంబము సంగతి చెప్ప వీలులేదు రఘు, గీతా, శశిచేతుల కలపినాడు, లలిత పిల్లల నప్పగించి, తనజన్మ ధన్యమైనదన్నాడు. తనతండ్రికోరిక - నీడేర్చినాడు. తనశశిని, కాపాడినాడు - తనప్రాణమా - పోయిన చింతలేదు! శశి యుండ, లలిత, పిల్లలకు కొదువఏది? దోషి యురికంబమున, యంతిమ సందేశమదియే.

శశీ, గీతలయానందమే తన పరమావధి!

శశీ, గీత, దుఃఖమెందుకు? మీ యిరువురి దాంపత్య శోభచూచి యానందించెడి - భాగ్యము నోచుకోలేదు. ఇది చింతకు సమయముకాదు. నాతండ్రికోర్కె నెరవేర్చి ధన్యుడనైనాను - సెలవు -

రఘు — న్యాయమునకు — బలియైనాడు! నిర్దోషికి శిక్ష దోషికి విడుదల యిది సంఘపు తీర్మానము. న్యాయ దేవత — అంధురాలు — కాకున్న — రఘు — న్యాయదేవతకు - బలియగునా? అంధ ప్రపంచము. అజ్ఞానతీర్మానములు. అన్యాయవైఖరులు.

రఘూ - ఎక్కడి రఘు? తమ్మునికై - రక్తమోడ్చి - తుదకు - ప్రాణమునేయర్పించిన, నీబ్రతుకు ధన్యము! భరతమాత సుపుత్రులలో నొక్కమణివంటి నీవు - త్యాగమూర్తి వనుటలో సందేహమా? త్యాగమూర్తీ - నీకిదే జోహారులు!!!

సమాప్తము.